
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం

KHAMMAM

శుక్రవారం 26 సెప్టెంబరు 2025

పార్టీలు రెడీ!

‘స్థానిక’ సమరానికి రాజకీయ పార్టీలు సై అంటున్నాయి. నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా ప్రత్యర్థులను ఢీ కొట్టేందుకు సిద్ధమంటూ పావులు కదుపుతున్నాయి. శ్రేణులను సమాయాత్తం చేస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నాయి. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ వేర్వేరు సమావేశాలతో పరిషత్ పోరుకు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఆ పార్టీలు గురువారం ఖమ్మంలో వేర్వేరు సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు సిద్ధం కావాలంటూ ఆయా పార్టీల కార్యకర్తలకు పిలుపునిచ్చాయి.

- ‘స్థానిక’ సమరానికి సై అంటున్న నేతలు
- ఖమ్మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సమావేశాలు
- ఎన్నికలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు నాయకుల పిలుపు

ఖమ్మం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్రంలో మండల, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికలకు నేడో రేపో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో రాజకీయపార్టీల్లో ఎన్నికల వేడి మొదలైంది. దీంతో తాము స్థానిక ఎన్నికలకు సై అంటూ అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ నేతలు సమావేశాలు నిర్వహిస్తూ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం ఖమ్మంలో బుధవారం అటు కాంగ్రెస్.. ఇటు బీఆర్ఎస్ పోటా పోటీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి దిశానిర్దేశం చేశారు.

మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ భేటీ..

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశంతో మంత్రి క్యాంపు ఆర్యాలంలో కాంగ్రెస్ సన్నాహక సమావేశం జరిగింది. ఖమ్మం నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరైన ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మంత్రి తుమ్మల తనయుడు తుమ్మల యుగంధర్, మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జిల్లా నాయకులు మానుకొండ రాధాకిషోర్, సాధురమేష్‌రెడ్డి, దీప్లానాయక్, నాగండ్ల దీపక్‌చౌదరి, తాతా రఘురాం, బాలగంగాధర్‌తిలక్ తదితరులు పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రఘునాథపాలెం మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీతో పాటు గ్రామపంచాయతీలను గెలిచి తీరాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతీ గ్రామంలో పది మంది సభ్యుల కమిటీ ఏర్పాటు చేసి గ్రామసమస్యలు పరిష్కారం చూపాలన్నారు. అందరూ ఇప్పటి నుంచే పట్టుదలతో పని చేయాలని సూచించారు. గడిచిన రెండేళ్లగా చేపట్టిన అభివృద్ధి పనులు వివరించాలని సూచించారు.



మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ప్రసంగిస్తున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పాల్గొన్న తుమ్మల యుగంధర్, నీరజ

పువ్వాడ నివాసంలో బీఆర్ఎస్ సమావేశం

బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో జరిగింది. ఈ సమావేశానికి నగరంతో పాటు రఘునాథపాలెం మండల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు హాజరయి రాబోయేస్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధం చేస్తూ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అడుగడుగునా కార్యకర్తలకు అండగ ఉంటామని భరోసానిస్తూ.. పార్టీ సత్తా చాటాలని సూచించారు. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ తాను సంపూర్ణ ఆరోగ్యంగానే ఉన్నానని తనపై కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తనకు రెండు మెడికల్ కాలేజీలున్నాయని, ఎంతోమంది డాక్టర్లున్నారని ఏ సమస్య అయినా గేటితో తన్ని బయటకు వస్తానని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి.. కేసీఆర్, కేటీఆర్‌లను సీఎంగా చూడడమే తన కోరికన్నారు. ఇక కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరలేదని, యూరియా సమస్య అధికంగా ఉందని, రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని ఇలాంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు, మాజీ ఎంపీ నామా

గజలక్ష్మి అలంకారంలో..

- దర్శనమిచ్చిన లక్ష్మీతాయారు అమ్మవారు
- తరలొచ్చిన భక్తులు
- నేడు ధనలక్ష్మి అలంకారం



గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు

భద్రాచలం, సెప్టెంబరు 25 : భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో గల శ్రీ లక్ష్మీ తాయారు ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీ అలంకారంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత లక్ష్మీతాయారు మూలవరులకు పంచామృతాలతో ప్రత్యేక స్నపనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గజలక్ష్మి అలంకారం ధరింపజేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఈ సమయంలో సామూహిక కుంకుమార్చన, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో గజలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అదేవిధంగా చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణం కొనసాగుతోంది.

స్వామి వారిని దర్శించుకున్న కర్ణాటక సీఆర్‌పీఎఫ్ ఐజీ

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని గురువారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఐజీ విపుల్‌కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం

(మిగతా 6లో..)

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా

కూనంనేని ఎన్నిక

- రెండోసారి ఎన్నుకుంటూ జాతీయ మహాసభల్లో తీర్మానం
- పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా బాగం హేమంతరావు, సాబీర్ పాషా



కూనంనేని



హేమంతరావు

కొత్తగూడెం టౌన్ / ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రెండోసారి ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అలాగే సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన బాగం హేమంతరావుతో పాటు పార్టీ భద్రాద్రి జిల్లా కార్యదర్శిగా ఉన్న ఎస్కే సాబీర్‌పాషా సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా తొలిసారి ఎన్నికయ్యారు. గత ఐదు రోజులుగా పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో సీపీఐ జాతీయ మహాసభలు జరుగుతుండగా.. గురువారం నూతన కార్యవర్గాన్ని



సాబీర్ పాషా

(మిగతా 6వ పేజీలో)

‘సర్వీసు రోడ్ల’ సమస్యల

పరిష్కారానికి కృషి

- గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల పరిశీలనలో మంత్రి పొంగులేటి
- వైరా, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిధిలో పర్యటన
- కూసుమంచి మండలం పెరికశింగారంలో 54 అడుగుల బతుకమ్మ
- వేడుకలకు హాజరైన మంత్రి పొంగులేటి

6లో



ముత్తగూడెం వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్

మద్యం జాతర



- నేటి నుంచి దుకాణాలకు దరఖాస్తులు
- లాటరీ పద్ధతిలో కేటాయింపునకు ఎక్సైజ్ శాఖ కసరత్తు
- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఖమ్మం జిల్లాలో 116, భద్రాద్రి కొత్తగూడెంలో 88 షాపులు..
- ఏజెన్సీ దుకాణాలు పూర్తిగా గిరిజనులకే..

ఖమ్మం,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మద్యం జాతర షురూ అయ్యింది. రెండేళ్ల పాటు మద్యం వ్యాపారం నిర్వహించుకునేందుకు గాను ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. తొలుత శుక్రవారం నోటిఫికేషన్‌ను జారీ చేసి ఆ వెంటనే దరఖాస్తులను స్వీకరించనుంది. వచ్చేనెల 18వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుండగా.. 23వ తేదీన లాటరీ పద్ధతిలో మద్యం షాపులు కేటాయించేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ లాటరీ విధానంలో షాపులు దక్కించుకున్న వారు రెండేళ్ల పాటు ఈఏడాది డిసెంబరు 1 నుంచి 2027నవంబరు 30వ తేదీ వరకు మద్యం షాపులను నిర్వహించుకుంటారు. అయితే గతంలో ఒక్కో దుకాణానికి దరఖాస్తు రుసుం రూ.2లక్షలు ఉండగా.. ఈసారి ఆ రుసుంను రూ.3లక్షలకు పెంచారు. మూడు లక్షలు చెల్లించి దరఖాస్తు చేస్తే లాటరీలో వచ్చిన అదృష్ట వంతులకే షాపులు కేటాయించనున్నారు. లాటరీలో షాపు దక్కని వారికి దరఖాస్తు రుసుంను తిరిగి చెల్లించే అవకాశం లేదు. ప్రస్తుతం ఉన్న షాపుల గడువు ఈనెల 30తో ముగియనుంది.



ఇరు జిల్లాల్లో షాపులు ఇలా..

ఖమ్మంజిల్లా పరిధిలో 116 మద్యం షాపులుండగా.. ఏజెన్సీ ప్రాంతంలో ఆరు షాపులున్నాయి. మొత్తం మద్యం దుకాణాల్లో గౌడ సామాజిక వర్గానికి 15శాతం 18షాపులు,

(మిగతా 6వ పేజీలో)



బతుకమ్మను ఎత్తుకున్న విమలక్క

ప్రకృతి రక్షణే..

ప్రజల రక్షణ

- ఆ నినాదంతోనే ఈ ఏడాది బతుకమ్మ వేడుకలు
- బహుజన బతుకమ్మ రాష్ట్ర కన్వీనర్ విమలక్క
- పాల్వంచ మండలం ఉల్వనూరులో పర్యటన

6

దసరా సందర్భంగా.. ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడ్రా

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ ఈ నెల 27 నుంచి అక్టోబరు 6 వరకు డీలక్స్, సూపర్‌లగ్జరీ, లహరి ఏసీ, నాన్ ఏసీ, రాజధాని బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు లక్కీడ్రాకు అర్హులను రీజనల్ మేనేజర్ సరిరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు ప్రయాణానంతరం టికెట్ వె నుకభాగంలో ప్రయాణికుడి పేరు, ఫోన్ నెంబరు, అడ్రస్‌ను రాసి బస్‌స్టాండ్‌లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లక్కీడ్రా బాక్సులలో వేయాలని సూచించారు. అక్టోబరు 8న ఖమ్మం నగరంలోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో లక్కీడ్రా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రీజియన్ పరిధిలో ముగ్గురిని ఎంపిక చేసి మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ. 10వేల నగదులను అందించడం జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి నగదు బహుమతులను పొందాలని తెలిపారు.

నేడు మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువగా..

- స్వల్పంగా పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- 37 అడుగులకు చేరిక
- నిర్దేశించిన ప్రాంతాల్లోనే స్నానాలకు అనుమతి



భద్రాచలం వద్ద గోదావరి

భద్రాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువ కానుంది. గత రెండు రోజులుగా స్వల్పంగా పెరుగుతూ వస్తున్న గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రం 37 అడుగులకు చేరుకుంది. అలాగే గోదావరి స్నానఘట్టాలు నీట మునగడంతో భక్తులను నిర్దేశించిన ప్రాంతంలోనే స్నానాలకు అనుమతిస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి 40 నుంచి 43 అడుగుల వరకు చేరే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎగువన రోజుల తరబడి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలోనే గోదావరి నీటిమట్టం భద్రాచలం వద్ద పెరుగుతుందని వారు పేర్కొంటున్నారు.

పోలీసు కుటుంబాలకు ఉచిత వైద్యపరీక్షలు

ఖమ్మం సీపీ సునీల్‌దత్



వైద్యపరీక్షలు పరిశీలిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు కుటుంబాలకు పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఉచిత ఈఎన్టీ వైద్యపరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఖమ్మం సీపీ సునీల్‌దత్ ప్రారంభించారు. పోలీసుసంక్షేమ కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బందికి ఈఎన్టీ వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిత్యం విధి నిర్వాహణలో ఉండే పోలీసు సిబ్బంది చెవి, ముక్కు, గొంతు వంటి చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వైద్య నిపుణులు సలహా, సూచనలతో ఆరోగ్యవంతమైన జీవనవిధానం అలవర్చుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో ఏడీసీపీలు ప్రసాదరావు,రామానుజం, ఏఆర్ఏడీసీపీ కుమారస్వామి విజయబాబు, ఏఆర్ ఏసీపీ నరసయ్య, సుశీల్‌సింగ్, ఇన్స్‌పెక్టర్ మోహన్‌రావు,ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సాంబశివరావు, నాగుల్‌మీరా, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైల్వేస్టేషన్‌లో శ్రమదానం

ఖమ్మంమామిళ్లగూడెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఖమ్మం రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం రాజేంద్ర, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సి మోహన్‌కుమార్ కోరారు.గురువారం స్వచ్ఛతాహిసేవా కార్యక్రమంలో భాగంగా ఖమ్మంరైల్వేస్టేషన్‌లో అధికారులు, సిబ్బంది శ్రమదానం చేశారు. స్టేషన్ ఆవరణంలోని చెత్తా చెదారాన్ని తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. చీపుర్లు చేతబూని పరిసర ప్రాంతాలన్నింటీని శుభ్రం చేశారు. ఈసందర్భంగా స్టేషన్ మేనేజర్ రాజేంద్ర మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ప్రయాణీకులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ప్రసన్న, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.





జూలూరుపాడులో విరగబూసిన బంతిపూల తోట, ప్రధాన రహదారి పక్కన బంతిపూలను విక్రయిస్తున్న రైతులు

విరబూసిన బంతి..

రైతుమోములో కాంతి

- పెట్టుబడి తక్కువ .. లాభాలు ఎక్కువ
- పండుగ వేళ బంతిపూలకు భలే గిరాకీ
- జోరుగా అమ్మకాలు..
- సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

జూలూరుపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలు.. ఉసూరు మనిపిస్తున్న తరుణంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారించారు. అందులో భాగంగా బంతి పూల సాగుపై దృష్టి సారించారు. భద్రాద్రి జిల్లాలో జూలూరుపాడు, చంద్రుగొండ, సుజాతనగర్, పాల్వంచ, అన్నపురెడ్డిపల్లి ప్రాంతాలలో 100ఎకరాల్లో రైతులు ఈఏడాది బంతిపూల సాగు చేపట్టారు. వాణిజ్య పంటలకు అధికపెట్టుబడులు పెట్టాల్సి రావటం.. ఆ మేరకు లాభాలు లేక అన్నదాత అప్పుల పాలు అవుతున్నాడు. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించే అవకాశాలు ఉన్న బంతి పంట సాగుకు రైతులు మొగ్గు చూపారు.

వ్యవధి తక్కువ... ఫలితం ఎక్కువ

విత్తనాలు నాటిన అతి తక్కువ వ్యవధిలో రైతుల చేతికి రావడం బంతి సాగులో వున్న ప్రత్యేకత. ఎకరానికి పది ప్యాకెట్లు విత్తనాలు అవసరం ఉంటుంది. ప్యాకెట్ సుమారు రెండువేలు ఉంటుంది. విత్తనం నాటి అనంతరం సుమారు 40రోజులకు పూలు పూస్తాయి. పంట చేతికొచ్చాక మూడు నెలల పాటు పూల దిగుబడులు వస్తాయి. ఈ సాగుకు గతఏడాది ఎకరానికి విత్తనాలతో కలుపుకొని లక్షరూపాయాలు పెట్టుబడి పెట్టగా ఈఏడాది రూ1.20 లక్షలకు పెరిగింది. గత ఏడాది ఎకరానికి మూడుటన్నుల బంతి పూల దిగుబడులు రాగా ప్రస్తుతం నాలుగు టన్నుల దిగుబడి లభిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అధిక వర్షాలకు ఎకరానికి టన్ను పూల దిగుబడి తగ్గిపోయిందని చెబుతున్నారు. ప్రభుత్వం రాయితీ కింద ఎకరానికి రైతులకు రూ.8 వేలు ఇస్తుండడంతో వారికి మరింత ప్రోత్సాహం లభించింది.

బంతి భలే గిరాకీ...

పూల పండుగైన బతుకమ్మ పండుగ జరిగే తొమ్మిది రోజులు బంతి పూలకు ఎక్కడ లేని గిరాకీ ఉంటోంది. ప్రస్తుతం కిలోబంతి పూలు రూ.100కు విక్రయిస్తున్నారు. దసరా పండుగ నాటికి రూ.150 వరకు ధర పలికే వీలుందని రైతులు భావిస్తున్నారు. దీపావళి, సంక్రాతి వరకు పూలకు గిరాకి ఇలానే కొనసాగుతుందని రైతులు పేర్కొంటున్నారు. అతి తక్కువ సమయంలో చేతికందే ఈ పంట మూడు నెలలపాటు అమ్ముడు పోతూ రైతులకు లాభాలు తెచ్చి పెడుతుందని అన్నారు. పెట్టుబడి పోను ఎకరానికి లక్షరూపాలకు పైగా ఆదాయం వస్తుందని తెలిపారు.

జూలూరుపాడు కేంద్రంగా అమ్మకాలు

మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన రైతులు బంతి పూల సాగు చేశారు. ప్రస్తుతం బతుకమ్మ వేడుకలు సాగుతుండడంతో జూలూరుపాడులోని ప్రధాన రహదారి పక్కన పూల రాశులను ఆకర్షణీయంగా పోసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, వ్యాపారులతో పాటు ఈ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు ఆగి మరీ పూలను కొనుగోలు చేస్తున్నారు.

ప్రభుత్వ రాయితీతో ఆనందం
పోరుండ్ల సైదులు, వెంగన్నపాలెం



బంతిసాగు చేపట్టిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఎకరానికి రూ.8 వేల చొప్పున రాయితీని అందిస్తున్నారు. ఈ ఏడాది పంట లాభాలు కురిపిస్తూ రైతుల్లో ఆనందాన్ని నింపుతుంది. 8 ఏళ్లుగా బంతి సాగు చేపడుతున్నాను. ఈ పంట సాగుతో ఎప్పుడు నష్టపోలేదు.

వాణిజ్య పంటల కంటే మేలు
కొమ్మిగిరి అపయ్య, వెంగన్నపాలెం



అత్యాశకు పోయి వాణిజ్య పంటలు వేసి నష్టపోయే కంటే బంతి పూల సాగే మేలు. పెట్టుబడిపోను రైతులకు మంచిఆదాయం లభిస్తుంది. పండుగలు శుభకార్యాల తరుణంలో బంతిపూలకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం కిలో రూ.100 పలకటం శుభ పరిణామం.

రైతులకు అధిక ఆదాయం
కిషోర్, భద్రాద్రి జిల్లా ఉద్యానాధికారి



బంతిసాగు ద్వారా రైతులకు మంచి ఆదాయం లభిస్తుంది. రాష్ట్రప్రభుత్వం బంతి సాగు చేపట్టిన రైతులకు రాయితీని అందిస్తుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించి బంతి సాగు ద్వారా కలిగే లాభాలను తెలియజేస్తున్నామన్నారు.

వ్యవసాయ కూలీలకు సమగ్రచట్టం తేవాలి

- ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంఅర్బన్ సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీల భద్రతకు ప్రభుత్వం సమగ్రచట్టాన్ని రూపొందించాలని ఏఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.. కామారెడ్డిలో నవంబరు 29,30 తేదీల్లో జరగబోయే ఏఐకేఎస్ ప్రథమ రాష్ట్ర మహాసభల విజయవంతానికి గురువారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. దేశంలో సన్న చిన్న కారు రైతులు కూడా గత్యంతరం లేక వ్యవసాయ కూలీలుగా మారుతున్నారని చెప్పారు. గ్రామాలలో పనులు దొరకక పట్టణాలు, నగరాల్లో అడ్డా కూలీలుగా దీనమైన స్థితిలో జీవిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. ఏఐకెఎస్ జిల్ల అధ్యక్షుడు రేపాకుల శివలింగం అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య, జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, కంకణాల అర్జున్ రావు, కూరాకుల నర్సయ్య, సోమనపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గని ప్రమాదంలో మరణించిన కార్మికుల పిల్లలకు క్లరికల్ పోస్టులు

- లేబర్ కమిషనర్ సమక్షంలో సింగరేణితో కుదిరిన ఒప్పందం

రుద్రంపూర్(సింగరేణి), సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): గనిప్రమాదంలో మృతి చెందిన కార్మికుల వారసులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులను ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించింది. విద్యార్హతను బట్టి కారుణ్య నియామకాలు చేపట్టాలనే డిమాండ్‌పై సింగరేణి యాజమాన్యం డిప్యూటీ లేబర్ కమీషనర్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం మధ్య సెప్టెంబరు5న ఒప్పందం కుదిరింది. హామీ పత్రాలతో గురువారం అగ్రిమెంట్ పత్రాలను హైదరాబాద్‌లోని డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో సింగరేణి జనరల్ మేనేజర్ కవితానాయుడు, గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ విశ్వభూషన్ అందజేశారు. గని ప్రమాదంలో మృతి చెందిన వారసులకు విద్యార్హతను బట్టి ఉద్యోగావకాశాలను కల్పించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈకార్యక్రమంలో సింగరేణి సివిల్ ఈ జీఎం ధనసరి వెంకటేశ్వర్లు, జీఎం ఎంఎస్ రవి బొజ్జ,కార్మిక సంఘంనాయకులు మిర్యాల రంగయ్య, వీరభద్రయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరణ

ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరణ ప్రతిపాదనలు తయారు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, రెవెన్యూ శాఖలోని పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. భూముల మార్కెట్ విలువ సవరణ, నిషేధిత భూముల జాబితా రిజిస్టర్ (22(ఎ)), భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, రేషన్ షాపుల పర్యవేక్షణ, జాతీయ రహదారుల కోసం సేకరించిన భూములను మ్యూటేషన్ వంటి పలు అంశాలపై అదనపు కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. మండలంలో ఉన్న రేషన్ షాపులను తహసిల్దార్ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. రేషన్ షాపులను ప్రభుత్వం ఆథరైజ్ చేసిన డీలర్లు మాత్రమే నిర్వహించాలన్నారు. అక్టోబర్ చివరి నాటికి జిల్లాలో ఉన్న అన్ని రేషన్ షాపులను తనిఖీ పూర్తి చేసి నివేదిక అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా

కూనంనేని ఎన్నిక

(5వ పేజీ తరువాయి)

ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఈ మహాసభల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులకు జాతీయ కమిటీలో స్థానం కల్పించారు. కూనంనేని కొత్తగూడెం ఎమ్మెల్యేగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా అనేక ప్రజాపోరాటాలో కీలక పాత్ర పోషించారు. ఇక ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుడిగా, సీపీఐ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న సాబీర్‌పాషాను జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమించడం పట్ల సీపీఐ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ సమితి సభ్యుడిగా బాగం

సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన బాగం హేమంతరావు నియామకం అయ్యారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు చండీఘర్‌లో జరిగిన పార్టీ జాతీయ సమితి సమావేశాల్లో ఈ మేరకు నియామకం జరిగింది. హేమంతరావు మొదట ఏఐఎస్ఎఫ్ నుంచి ఏఐవైఎఫ్.. ఆ తర్వాత సీపీఐలో జిల్లా సమితి కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయిలో అనేక బాధ్యతలు నిర్వహించారు. ముతాపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కాగా.. హేమంతరావు జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నిక కావడం పట్ల ఉమ్మడి జిల్లా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

మద్యం జాతర

(5వ పేజీ తరువాయి)

ఎస్సీలకు10శాతం 14షాపులు, ఎస్టీలకు 5శాతం 2దుకాణాలు కేటాయించారు. మిగిలిన 76దుకాణాలను జనరల్‌కే కేటాయి ంచారు. ఇక ఏజెన్సీ ప్రాంతంలోని షాపులన్నీ గిరిజనులకు కేటాయించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 88షాపుల్లో 44 ఏజెన్సీ ప్రాంతంలో ఉండడం తో వాటిని పూర్తిగా గిరిజనులకు కేటాయించారు. మిగిలిన 44షాపుల్లో బీసీ గౌడకు 6, ఎస్సీలకు 7, జనరల్ 31షాపులు రిజర్వేషన్ అమలు చేయనున్నారు. రిజర్వుడ్ షాపుల వివరాలు శుక్రవారం అధికారికంగా వెల్లడించనున్నారు. గతంలో భద్రాద్రి జిల్లాలో 88మద్యం షాపులకు 5,057దరఖాస్తులు రాగా రూ.101.14 కోట్లు ఆదాయం వచ్చింది. ఖమ్మం జిల్లాలో 116 దుకాణాలకు రూ.144.14కోట్ల ఆదాయం వచ్చింది.

దరఖాస్తులపై వ్యాపారుల దృష్టి

గతంలో సిండికేట్ విధానంలో చాలామంది వ్యాపారులు, పొరుగు వారు జిల్లాకు వచ్చి షాపులు దక్కించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. లాటరీ విధానం పెట్టిన తర్వాత కూడా ఏపీ నుంచి వ్యాపారులు వస్తూనే ఉన్నారు. ఈ సారి కూడా వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఖమ్మంలో కొందరు మద్యం వ్యాపారులతో ఏపీ మద్యం వ్యాపారులు మంతనాలు సాగిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఉన్నందున అక్కడ బినామీ గిరిజనుల పేరుతో షాపులు దక్కించుకునేందుకు కొందరు వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

రూ.200కొట్టు.. మేకను పట్టు

- పండుగ వేళ గోవింద్రాల యువత లాటరీ
- బహుమతుల్లో మద్యం కూడా..



సామాజిక మాధ్యమంలో ప్రచారం అవుతున్న పోస్టర్

కామేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 'రూ.200కొట్టు మేకను పట్టు' అంటూ కామేపల్లి మండలం గోవింద్రాల యువత వినూత్నంగా లక్కీ లాటరీ పెట్టి ప్రజలను ఆకర్శిస్తున్నారు. దసరా కానుకగా ఏర్పాటు చేసిన ఈ లక్కీ లాటరీలో రూ.200పెట్టి కూపన్ తీసుకుంటే అక్టోబరు1న ప్రజల సమక్షంలో లక్కీ డ్రా తీస్తారు. ఆ డ్రాలో మొదటి విజేతకు 10కిలోల మేకపోతు, రెండో బహుమతిగా మిక్సీ, మూడో బహుమతిగా పట్టుచీర అందిస్తారు. మరో విశేషం ఏంటంటే నాలుగోబహుమతిగా రెండు మద్యం ఫుల్ బాటిళ్లు, ఐదోవ బహుమతిగా కాటన్ బీర్లు ఇస్తామని నిర్వాహకులు ఓ డిజిటల్ ప్రకటనను విడుదల చేశారు. దీన్ని చూసిన ప్రజలు అవాక్కవుతున్నారు.

సర్వీస్ రోడ్ల నిర్మాణ సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పెరికశింగారం గ్రామంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొంగులేటి

వైరా / కల్లూరు / కూసుమంచి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవేలో సర్వీస్ రోడ్ల నిర్మాణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం మంత్రి పొంగులేటి ఖమ్మం జిల్లా వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్ నాయక్, మట్టా రాగమయితో కలిసి వైరా, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణపనులు పరిశీలించి సర్వీస్ రోడ్లతో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను తెలుసుకున్నారు. కల్లూరు మండలం ముత్తగూడెం వద్ద ఎంట్రీ నుంచి వైరా ఎగ్జిట్ వరకు ఆయన ప్రయాణించి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ 5కిలోమీటర్లకు ఒక అధికారిని నియమించి ఎన్‌హెచ్ డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలిస్తామని రైతుల సమస్యలు పరిష్కరించిన తర్వాతే ఎన్‌వోసీ జారీ చేస్తామని స్పష్టం చేశారు. నేషనల్ హైవే ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోయే రైతుల బాధను ప్రభుత్వం సున్నితంగా పరిగణిస్తోందన్నారు. రైతుల భూ హక్కులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు. భూములు కోల్పోయిన రైతులను ఇబ్బందులు పెట్టకుండా అందుబాటులో ఉన్న స్థలంలో అప్రోచ్ రోడ్డు నిర్మించాలని హైవే అధికారులను కోరారు. రైతులు చెప్తున్న సమస్యలను పరిష్కారం చేసిన తర్వాత మాత్రమే జాతీయ రహదారి పనులు పూర్తి చేసినట్లు సర్టిఫికెట్ జారీ చేయాలని అన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో నిర్మాణంలో భాగంగా ముత్తగూడెం, రేజర్ల, పెనుబల్లి, లింగాల, కల్లూరు, వైరా ప్రాంతాల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో సమీక్షించారు. మంత్రి పర్యటనలో కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, నేషనల్ హైవే పీడీ దివ్య, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, మచ్చా బుజ్జి, కోసూరి శ్రీను, వీరయ్య తదితరులున్నారు.



పెరికశింగారంలో 54 అడుగుల భారీ బతుకమ్మ

బతుకమ్మ వేడుకల సందర్భంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పెరికశింగారం గ్రామంలో 54అడుగుల భారీ బతుకమ్మను పేర్చారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈఅతిపెద్ద బతుకమ్మను పేర్చారు. గతేడాది 51 అడుగుల బతుకమ్మను పేర్చగా.. ఈ ఏడాది 54అడుగుల ఎత్తు పేర్చారు. దీని కోసం సుమారు ఏడుక్వింటాళ్ల బంతి, టేకు, తంగేడు, గునుగు పూలను వినియోగించినట్లు గోపాలరావు దంపతులు తెలిపారు. సుమారు 25మంది పదిగంటల పాటు శ్రమించారు. పెరికశింగారంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర రెవిన్యూ సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. 54అడుగుల భారీ బతుకమ్మను పేర్చిన జూకూరి గోపాలరావు దంపతులను పొంగులేటి అభినందించారు. కార్యక్రమంలో పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, జొన్నలగడ్డ రవికుమార్, పాల్గొన్నారు.

స్థంభాద్రి నృసింహుడికి ఘనంగా గిరిప్రదక్షణ

- సమాచారం లేక వేడుకకు హాజరవలేకపోతున్న భక్తులు
- ఆలయ , దేవాదాయ శాఖ అధికారుల తీరుపై విమర్శలు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వయంభు దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి (గుట్ట) గిరి ప్రదక్షణ గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణా చార్యులు, శ్రీనివాసచార్యులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు, దేవాదాయ శాఖ అధికారులు, భక్తబృందాల ఆధ్వర్యంలో ఈ వేడుక జరగ్గా.. గిరి ప్రదక్షణ మార్గంలో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. అయితే ప్రతీ నెల స్వామి వారి జన్మ నక్షత్రం రోజున స్థంభాద్రి గిరి ప్రదక్షణ నిర్వహిస్తుండగా.. గురువారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు జరిగింది. అనంతరం కొండపై ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన స్వాతి నక్షత్ర జ్యోతిని వెలిగించగా.. భక్తులు దివ్యజ్యోతి దర్శనం చేసుకున్నారు.



స్వాతీనక్షత్ర జ్యోతిని వెలిగిస్తున్న అర్చకులు

తగ్గుతున్న ఆదరణ

గత నెలలో స్వామి వారి గిరి ప్రదక్షిణ నిర్వహించకపోవటంతో గురువారం నిర్వహించిన గిరిప్రదక్షణకు భక్తులు అంతగా హాజరవలేదు. దీనికి తోడు సమాచారం లోపం కూడా కారణమవుతోంది. వేడుక నిర్వహణ తేదీలు, విశిష్టత గురించి భక్తులకు తెలపడం, ప్రచారం చేయడంలో ఆలయ, దేవాదాయ శాఖ అధికారులు చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా నెలనెల గిరి ప్రదక్షణకు భక్తులు తగ్గుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ఇలానే ఉంటే మున్ముందు అసలు భక్తులు పాల్గొంటారో లేదో తెలియని పరిస్థితి. ఇటు భక్తులకు కానీ.. అటు మీడియా వారికి కానీ ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. ఇక తమకు గిరిప్రదక్షిణలో పాల్గొనాలని ఉన్నా.. సరైన సమాచారం లేకపోవటంతో పాల్గొనలేకపోతున్నామని పలువురు భక్తులు వాపోతున్నారు. ఇకనైనా స్వామివారి గిరిప్రదక్షణ వివరాలను ప్రతీ నెల ముందుగా తెలియపరచాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై ఆలయ ఈవో జగన్‌మోహన్‌రావు స్పందిస్తూ.. సిబ్బంది సరిపడా లేకపోవటంతో ప్రజలకు తేదీలు, ఇతర సమాచారం అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వాతావరణ పరిస్థితి కారణంగా గురువారం వేడుకకు భక్తులు తక్కువగా వచ్చారని, ఇక నుంచి ప్రతీ నెల ముందుగానే గిరిప్రదక్షణ సమాచారాన్ని అందిస్తామని తెలిపారు.

ప్రకృతి రక్షణే.. ప్రజల రక్షణ..

- ఆ నినాదంతోనే ఈ ఏడాది బతుకమ్మ వేడుకలు
- బహుజన బతుకమ్మ రాష్ట్ర కన్వీనర్ విమలక్క
- పాల్వంచ మండలం ఉల్వనూరులో పర్యటన



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న విమలక్క

పాల్వంచ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి రక్షణే ప్రజల రక్షణ అనే నినాదంతోనే ఈ ఏడాది బహుజన బతుకమ్మ జరుపుకోవాలని బహుజన రాష్ట్ర కన్వీనర్ విమలక్క అన్నారు. పాల్వంచ మండలంలోని అటవీ గ్రామమైన ఉల్వనూరులో బహుజన బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉల్వనూరు ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా సమ్మక్క సారక్క గద్దెలకు చేరుకున్నారు. పలు గ్రామాల నుంచి బతుకమ్మలతో వచ్చిన మహిళలతో కలిసి విమలక్క ఆడిపాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగను ప్రకృతిని గౌరవించే విధంగా ఉంటుందన్నారు. ఈ పండుగను సెక్యూలర్ పండుగగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నాగరికతకు ఆదివాసులే మూలవాసులని, ప్రకృతిని వారు ఎంతో గౌరవిస్తారని, ప్రేమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉల్వనూరు మాజీ సర్పంచ్ రుద్ర, స్త్రీ విముక్తి మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు అరుణ, మంగన్న పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని, దక్షిణాది రాష్ట్రాల్లోని దండకారణ్యంలో జరిగేవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్‌లే అని బహుజన బతుకమ్మ రాష్ట్ర కన్వీనర్ విమలక్క ఆరోపించారు. ఉల్వనూరులో విలేకరులతో మాట్లాడిన ఆమె అడవులను ధ్వంసం చేస్తూ విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు గాను మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపుతున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఇద్దరిని ఎన్‌కౌంటర్ల పేరుతో చంపారని ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆదివాసీ గ్రామాలలో పోలీసులు భయాందోళనలు సృష్టిస్తున్నారని అన్నారు.

గజలక్ష్మి అలంకారంలో..

(5వ పేజీ తరువాయి)

పలుకగా.. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు.

దేవస్థానం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం వైకుంఠ ద్వారం వద్ద బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు దంపతులతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది బతుకమ్మ కార్యక్రమం లో పాల్గొని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

సైబర్ నేరస్థుడి అరెస్టు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం డీఎస్పీ ఆర్.వీ.ఫణీందర్ తెలిపారు. నగరానికి చెందిన ఉద్యోగి అకౌంట్ నుంచి అతనికి తెలియకుండా రూ.11.49 లక్షలు కాజేసిన ఘటనలో గతంలో సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్ నందు కేసు నమోదైంది. ఈ కేసులో డబ్బులు జమ అయిన మ్యూల్ బ్యాంక్ అకౌంట్ హోల్డర్‌లను గతంలోనే సైబర్‌క్రైం పోలీసులు అరెస్ట్ చేశామని తెలిపారు. అలాంటి మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సేకరించి సైబర్ నేరస్తులకు, పలు బెట్టింగ్ యాప్ వారికి సహకరిస్తున్న రంగారెడ్డి జిల్లా శంకరపల్లికి చెందిన కావలి శ్రీనివాస్ నిందితుడిగా గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌ను తన గ్రామంలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్ఐ రంజిత్ కుమార్, విజయ్‌కుమార్, కానిస్టేబుల్ కృష్ణారావు, ఉదయభానుమూర్తిలను సీపీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

కూసుమంచి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కూసుమంచికి చెందిన వేముల సాయి (26) అనే యువకుడు పురుగుమందు సేవించి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మద్యానికి అలవాటుపడిన సాయి మద్యం మత్తులో పదిహేను రోజులక్రితం గడ్డి మందు సేవించాడు. ఈక్రమంలో ఖమ్మంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని సోదరుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఉద్యోగుల కృతజ్ఞత

భద్రాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌కు భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. ఎండీ సజ్జనార్‌తో పాటు ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులకు వారు క్షీరాభిషేకం నిర్వహించారు. ఎనిమిది రోజులుగా భద్రాచలం ఆర్టీసీ డిపో ఉద్యోగులు సమస్యల పట్ల చేసిన వినతికి ఎండీ, ఇతర అధికారులు సానుకూలంగా స్పందించడం పట్ల వారు ధన్యవాదాలు తెలిపారు.

రహదారిపైనే విద్యుత్ స్తంభాలు

» ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని వాహనదారుల ఆవేదన

వైరా, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరా ట్రాన్స్‌కో పనితీరు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి అంచుకే కరెంట్ స్తంభాలను ఏర్పాటు తమ బాధ్యతల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తమశాఖ నుంచి ట్రాన్స్‌కో అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా తమ పరిధిలోని రోడ్డుపైన అడ్డగోలుగా కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డులో సోమవరం నల్లచెరువు వాగు సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు అంచుకే కరెంట్ సపోర్టు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే రెండు వరుసల రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా నిర్మించే పనులు ఏడాదిన్నర కిందటే మొదలు పెట్టారు. సకాలంలో పనులు చేసి ఉంటే ఈపాటికే నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం పూర్తయ్యేది. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం వలన నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా పడి ఉంది. ఇదే సమయంలో ట్రాన్స్‌కో అధికారులు ఇటీవల నల్లవాగు సమీపంలో పలు విద్యుత్ లైన్ల పునర్నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు అంచుకు ఒక స్తంభం ఏర్పాటు చేసి దాని చుట్టూ మరో మూడు స్తంభాలను సపోర్టింగ్(స్టట్)పోల్స్‌ను ఏర్పాటుచేశారు. ఒక స్టట్ పోల్ పూర్తిగా ఆర్అండ్‌బీ రోడ్డు బీటీకి అంచులో ఏర్పాటుచేశారు. రాత్రి వేళల్లో వాహనాలు ఈ స్టట్ పోల్‌ను ఢీకొని ప్రమాదాలు సంభవించే అవకాశముంది. కొద్దిరోజులకైనా నాలుగు వరుసల రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఆసమయంలో మళ్లీ ఏకంగా మూడు స్టట్ పోల్స్ విద్యుత్ తీగెలు ఏర్పాటుచేసిన ఒక కరెంట్ పోల్‌ను మళ్లీ మార్చాల్సిన పరిస్థితి ఉంది. ఆపోల్స్ మార్పటానికి మళ్లీ ఆర్అండ్‌బీశాఖ నుంచి లక్షలాదిరూపాయలను ట్రాన్స్‌కోకు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే క్రాస్‌రోడ్డు నుంచి వ్యవసాయ మార్కెట్‌యార్డు వరకు రెండువైపులా కరెంట్ స్తంభాల షిఫ్టింగ్‌కు ఆర్అండ్‌బీ నుంచి ట్రాన్స్‌కో దాదాపు రూ.40లక్షలకుపైగా చెల్లించారు. ఇదే రోడ్డుపైన నల్లవాగు వద్ద ట్రాన్స్‌కో అధికారులు రోడ్డు అంచుకే కరెంట్ స్తంభాలు ఏర్పాటుచేశారు. ఈ స్తంభాలను తొలగించకుండా నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టడం సాధ్యం కాదు. ఈ స్తంభాలు రోడ్డు అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నాయి. కూత వేటు దూరంలోనే గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్డు కూడా ఉన్నాయి. భద్రాచలం, కొత్తగూడెం, తల్లాడ నుంచి వచ్చే వాహనాలు ఈ గ్రీన్‌ఫీల్డ్ సర్వీస్ రోడ్డు నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు కొనసాగించనున్నాయి. క్రాస్‌రోడ్డు నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే వరకు విధిగా నాలుగు వరుసల రోడ్డును నిర్మించటం అనివార్యం. అలాంటి ఈ రోడ్డులో ట్రాన్స్‌కో అధికారులు అడ్డదిడ్డంగా కరెంట్ స్తంభాలు వేస్తున్నారు. తమ పనులకు అడ్డంకిగా ఏర్పాటు చేస్తున్న కరెంట్ స్తంభాలను అడ్డుకోకుండా ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డు అంచుకే వేసిన సపోర్టు కరెంట్ స్తంభాలు

యూరియా లారీ అడ్డగింత

» ఎనిమిది గంటల పాటు నిరసన తెలిపిన రైతులు

» అధికారుల హామీతో ఆందోళన విరమణ

బూర్గంపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యూరియా సరపరాలో జరుగుతున్న జాప్యంపై రైతులు మండిపడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామ రైతులు యూరియా కోసం రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సొసైటీ గోదాంకు వచ్చిన లారీలో నుంచి 5టన్నులు దిగుమతి చేసి మిగతా లోడును మరో చోటకు తరలిస్తుండగా రైతులు ఆ లారీని అడ్డుకుని నిరసన తెలిపారు. లారీలోని యూరియా మొత్తాన్ని దిగుమతి చేయాలని పట్టుబట్టారు. యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంటలకు ఎరువులు వేయాల్సిన సమయం కూడా దాటిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పైరవీలు పలుకుబడి ఉన్న రైతులకే యూరియా ఇస్తున్నారని సాధారణ రైతులకు స్టాక్ లేదనే సమాధానం చెబుతున్నారని రైతులు మండిపడ్డారు. పంటల సాగుకు కీలకమైన ఈ సమయంలో ఎరువు అందకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఇప్పటికైనా అధికారులు యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. అధికారులు ఆందోళనకారులతో మాట్లాడి యూరియా సరాఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. గురువారం గ్రామానికి 5టన్నులు యూరియా వచ్చిందని ఇక్కడ నెలకొన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రెండు, మూడు రోజుల్లో యూరియా లారీ వస్తుందని తెలిపినట్లు సొసైటీ సీఈవో ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. దీంతో లారీని అక్కడి నుంచి పంపించివేశారు.


నిరసన తెలుపుతున్న నాగినేనిప్రోలు రైతులు

ఎన్నెస్పీ భూముల సర్వే

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :ఖమ్మంలో ఎన్నెస్పీ భూముల లెక్కలు తేల్చేందుకు రెవెన్యూశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నాగార్జున సాగర్ కాలువల నిర్మాణ సమయంలో 1967లో ఈ భూములను సేకరించారు. ఇప్పటి వరకు ఎన్నెస్పీ పర్యవేక్షణలో ఈ భూములు ఉండగా క్రమేణా రెవెన్యూ శాఖకు బదిలీ అయ్యాయి. ఈ నేపథ్యంలో కొందరు రీ కస్వే పేరుతో తమ భూములను రైతులకు చెందిన కుటుంబాలు వెనుకకు తీసుకున్నారు. ఆ తర్వాత ఆర్టీసీ బస్టాండు, ఆర్‌డబ్ల్యూఎస్, అంబేద్కర్ కాలేజీ, భూగర్భజలవనరుల శాఖ ఇలా ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలను కేటాయించారు. దీనితో పాటు వివిధ పార్టీల కార్యాలయాలకు ఎన్నెస్పీ స్థలాలు కేటాయించారు. అయితే వీటిపై గురువారం ఖమ్మం అర్బన్ తహసీల్దారు సైదులు ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. ఏ స్థలం ఎంత ఎవరు వినియోగిస్తున్నారు. వారికి ఉన్న పట్టాలు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న స్థలాలకు సరిహద్దులను ఏర్పాటు చేశారు. ఎన్నెస్పీ భూములు 92 ఎకరాల్లో ఇప్పటి వరకు అవసరాలకు వినియోగించిన తర్వాత 7 ఎకరాలు ఖాళీ స్థలం ఉన్నట్లు గుర్తించారు. వాటిని సంరక్షించేందుకు చర్యలు చేపట్టారు. అంతే కాకుండా ఈ భూముల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఇళ్లు, ప్రైవేటు విద్యాసంస్థల స్థలాలు, వారికి ఉన్న పట్టాలను పరిశీలిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఒక కొలిక్కిరానున్నట్లు తెలిపారు.


ఎన్నెస్పీ కాలనీలో ప్రభుత్వ భూమికి సరిహద్దులను పరిశీలిస్తున్న తహసీల్దారు సైదులు

రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని ఫిర్యాదు

కొత్తగూడెం లీగల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్ నుంచి కోర్టు, శేషగిరి నగర్ మీదుగా హేమచంద్రాపురం వెళ్లే రోడ్డు రెండు సంవత్సరాలుగా పూర్తిగా మరమ్మతులకు గురైంది. వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీనియర్ జర్నలిస్ట్ రెశ్వంత్ జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ఫిర్యాదు చేశారు. రోడ్డు నిర్మాణం పనులు వెంటనే చేపట్టే విధంగా బాధ్యులైన అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ప్రతి వాదులుగా జిల్లా కలెక్టర్, కొత్తగూడెం ఎమ్మెల్యే, సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి, డివిజనల్ ఇంజనీర్‌లను చేర్చినట్లు తెలిపారు. ఈ మేరకు పిఎల్‌సిఎస్ఆర్ నెంబర్ 972/2025గా కేసు నమోదు చేశారు. పై ప్రతివాదులను 2025 సెప్టెంబరు 29న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఎదుట హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు.

రామ భక్తుడిపై వ్యాపారి దాడి

భద్రాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి ఒడ్డున స్నానం చేస్తున్న ఓ రామ భక్తునిపై సమీపంలో కొబ్బరికాయలు అమ్ముకునే వ్యాపారి దాడి చేసిన సంఘటన జరిగింది. గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన చెరుకు ఆంజనేయులు తన కుటుంబ సభ్యులతో కలిసి స్నానాలు చేసేందుకు గోదావరి ఒడ్డున దిగారు. ఈ సమీయంలో ఓ వ్యాపారి వృద్ధ దంపతులను దూషిస్తుండగా ఎందుకు అలా చేస్తున్నావని తాను అడిగినట్లు ఆంజనేయులు విలేకర్లకు తెలిపారు. దీంతో మద్యం మత్తులో ఉన్న సదరు వ్యాపారి తనపై రాయితో దాడి చేయడంతో పాటు తనను తన భార్యను దుర్భాషలాడారని వాపోయాడు. దీంతో ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో, బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తాగుతున్న యువకులపై కేసు నమోదు

పాల్వంచ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులపై పాల్వంచ టౌన్ పోలీసు లు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణ పరిధి కరకవాగు రైల్వే ట్రాక్‌పై గంజాయి సేవిస్తున్న అజ్మీరా రమేష్, సందెబోయిన సాయికిరణ్‌లను పెట్రోలింగ్ పార్టీ పోలీసులు గుర్తించారు. వారిని వెంబడించి పట్టుకునే క్రమంలో సాయికిరణ్ పరారవగా అజ్మీరా రమేష్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి సుమారు 50 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యం

» ఏఐటీయూసీ నాయకుల ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న మల్లిఖార్జున్‌రావు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి మల్లిఖార్జున్‌రావు ఆరోపించారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని పివికె-5 ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సింగరేణి సంస్థకు అధిక లాభాలు వచ్చినప్పటికీ కార్మికులకు 34 శాతం మాత్రమే ప్రకటించిందన్నారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను మోసం చేశాయని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులకు సైతం రూ.500 పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రూ.పదివేల బోనస్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను సంస్థ అభివృద్ధి పేరుతో నిధులను పక్కకు పెట్టడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్‌ను పెంచాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. వీరాస్వామి, రాములు, హుమాయున్, సందెబోయిన శ్రీనివాస్, కమల్, రమేష్, సాయి, పవన్, రాంచందర్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

భద్రాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి ఒడ్డున గురువారం ఏపీలోని కృష్ణాజిల్లా టెన్త్ ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్‌కు చెందిన ఎన్డీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి వరదల సమయంలో ప్రమాదవశాత్తు ఎవరైనా మునిగిపోతే ఏ విధంగా రక్షించవచ్చు, అలాగే పడవ బోల్తా పడిన సమయంలో ఏ విధంగా బయటపడాలో సోదాహరణంగా వివరించారు. అలాగే నీళ్లల్లో మునిగి స్పృహ లేని స్థితిలో ఉన్న వ్యక్తికి ఏ విధంగా సీపీఆర్ చేయాలి ఏ విధంగా అంబులెన్సులో తరలించాలి లాంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, సీఐ నాగరాజు, ఎస్సైలు శ్యామ్, సతీష్, ఎన్డీఆర్ఎఫ్ టెన్త్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రయాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రమాదంలో చిక్కుకుంటే ఎలా బయటపడాలో వివరిస్తున్న దృశ్యం

మిరపనారుపై గడ్డి మందు కొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

» రేపల్లెవాడలో సంఘటన

ఇల్లెందురూరల్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మిరప నారుపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు కొట్టిన సంఘటన మండలంలోని రేపల్లెవాడలో చోటు చేసుకుంది. రేపల్లెవాడ గ్రామానికి చెందిన ఎస్‌కే. సలీం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన నాలుగు ఎకరాల మిర్చి తోట కోసం 70 ప్యాకెట్ల మిరప నారు పోశాడు. ఆ నారు ఎదిగి తోట వేయడానికి సిద్ధంగా ఉంది. గత రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మిరప నారుపై గడ్డి మందు కొట్టడంతో మిరప నారు మొత్తం మాడిపోయింది. ఈవిషయాన్ని స్థానిక గ్రామస్థులకు తెలపడంతో తోటి రైతుల సహాయంతో వ్యవసాయశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు రైతు చేశాడు. కాగా గురువారం వ్యవసాయశాఖ అధికారులు మాడిపోయిన మిరప నారును పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వ్యక్తి అరెస్టు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): తరుచు గొడవలు పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టుటౌన్ సీఐ బి.బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రమణగుట్టకు చెందిన సంకినేని మహేష్ అనే వ్యక్తి కొంతకాలంగా తరుచు గొడవలు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని ఈక్రమంలో ఈనెల 22న వికలాంగులకాలనీ నందు పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని ప్రభాకర్ అనే వ్యక్తిపై మహేష్ అతని స్నేహితులు కలిసి దాడిచేశారని తెలిపారు. గతంలో మహేష్ మొత్తం ఏడు కేసులలో నిందితుడిగా ఉన్నాడని, ఈనేపథ్యంలో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అదేవిధంగా ఇతనిపై రౌడీషీట్ కూడా తెరవబడుతుందని సీఐ ప్రకటనలో తెలిపారు.

థియేటర్‌లో స్పీకర్ బాక్స్‌పడి ఇరువురికి గాయాలు

భద్రాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఓజీ సినిమా ప్రదర్శిస్తున్న ఏషియన్ ఉదయ భాస్కర్ థియేటర్‌లో బుధవారం రాత్రి సమయంలో ప్రీమియర్ షో ప్రదర్శిస్తుండగా బాల్కానీలో పై భాగంలో ఉన్న స్పీకరు ఒక్కసారిగా ఊడి సినిమా తిలకిస్తున్న ఇరువురు ప్రేక్షకుల తలపై పడింది. దీంతో భద్రాచలానికి చెందిన పిడుగురాళ్ల శివ, బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన ఎస్.రమేష్‌లు గాయపడ్డారు. వెంటనే వారిని హుటాహుటిన ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. వారికి థియేటర్ యాజమాన్యం వారే వైద్య పరీక్షలు, చికిత్స అందించారు. వారికి ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి లేనట్లు గాయపడ్డ వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రీమియర్‌షో సమయంలో థియేటర్‌లో నిర్ణీత సంఖ్య కంటే మించి ప్రేక్షకులు ఉన్నా అధికార యంత్రాంగం ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే టికెట్లు సైతం భారీ గా బ్లాక్‌లో విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిందితులకు శిక్షపడేలా పనిచేయాలి: ఎస్పీ

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల నేరాలకు పాల్పడిన నిందితులకు ఆయా కేసుల్లో ఖచ్చితంగా శిక్షపడే విధంగా బాధ్యతగా పనిచేయాలని, రాష్ట్ర సరిహద్దులో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. అశ్వారావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బందితో కలిసి మొక్కను నాటారు. అనంతరం స్టేషన్‌లోని వివిధ రకాల రికార్డులను తనిఖీ చేశారు. నేరాలు, తీసుకున్న చర్యలు, కేసుల పురోగతితో పాటు పలు అంశాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కోడిపందాలు, పేకాట, బెట్టింగ్‌ల వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి ఆయా కేసుల్లో పట్టుబడిన వారికి చట్టప్రకారం శిక్షలు పడేలా చూడాలని సూచించారు. అంతరాష్ట్ర దొంగల ముఠాల కదలికలపై నిఘా ఉంచి దొంగతనాలు జరగకుండా చూడాలని తెలిపారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా ప్రజలను భాగస్వాములు చేస్తూ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్ఐలు యయాతిరాజు, సాయికిషోర్‌రెడ్డి, రామ్మూర్తి, అఖిల, పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

పామాయిల్ కర్మాగారం సందర్శన

దమ్మపేట : అప్పారావుపేట పామాయిల్ కర్మాగారాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం సాయంత్రం సందర్శించారు. కొత్తగా పామాయిల్ సాగు చేసే ఆలోచనతో రోహిత్‌రాజ్ కర్మాగారాన్ని సందర్శించినట్లు తెలిసింది. ఈసందర్భంగా మేనేజర్ కళ్యాణ్ కర్మాగారము నిర్మాణం, క్రషింగ్ వివరాలు, ఆయిల్ ప్రాసెసెంగ్, తదివిరాలు వివరించారు. దమ్మపేటలోని రైతు హరికృష్ణకు చెందిన పామాయిల్ తోటలను సందర్శించి అంతరపంటలను సాగు వివరాలు తెలుసుకున్నట్లు తెలిసింది. సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భావనా ప్రియ సాహిత్యపు పండుగలు ప్రారంభం

భద్రాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని జీయర్ మఠంలో భావనాప్రియ ఎనిమిదేళ్ల సాహిత్యపు పండుగలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజున నవరస కవి చక్రవర్తి చక్రవర్తి వచన కవిత్వంపై తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ మేడిపల్లి రవికుమార్, వరంగల్‌కు చెందిన డాక్టర్ గిరిజా మనోహరబాబులు చక్రవర్తి పద్యకవిత్వం వైభవాన్ని వివరించారు. అలాగే చక్రవర్తి గల్పికలలో విశేషాల గురించి విజయవాడకు చెందిన అధ్యాపకులు డాక్టర్ సశ్రీ చక్రవర్తి శతక సాహిత్యం అనే అంశంపై వివరించారు. అలాగే చక్రవర్తి రచించిన వచన కవితలు, ఆర్తగీతం, కథానికలు తీరం చేదని అలలు, బతుకుచిత్రాలు, పొట్టి కవితలు, చుక్కల మేడ, గజల్స్ ప్రాణయరాగవాహిని ఆవిష్కరణలు అయ్యాయి.


చక్రవర్తి రచనలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పినపాక ఎమ్మెల్యే పాయంకు నిరసన సెగ

» కాపునకు వచ్చిన పత్తిపంటను ధ్వంసం చేసిన అటవీ అధికారులు

» న్యాయం చేయాలంటూ పాయం వాహనాన్ని అడ్డుకున్న బాధిత రైతులు


ఎమ్మెల్యే వాహనం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు


న్యాయం చేయండంటూ పాయం కాళ్లపై పడిన రైతులు

ఆళ్లపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఆళ్లపల్లి మండలంలో పోడు రైతుల నుంచి నిరసన సెగ ఎదురైంది. కాపునకు వచ్చిన పత్తి పంటను బుధవారం రాత్రి అటవీ శాఖ అధికారులు ధ్వంసం చేశారంటూ ఆగ్రహించిన రైతులు తమకు న్యాయం చేయాలంటూ గురువారం ఆళ్లపల్లిలో ఎమ్మెల్యే పాయం వాహనాన్ని అడ్డుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. ఆళ్లపల్లి మండలం రాయిపాడు గ్రామానికి చెందిన ఊకే నాగేశ్వరరావు ఇల్లెందు నియోజకవర్గం టేకులపల్లి మండలం టేకులపల్లి రేంజ్ మొరళిపాడు బీట్‌లో ఎకరానికి పైగా పోడు భూమిలో పత్తి పంట సాగుచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆ భూమిలోని పత్తిపంటను తొలగించి, అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పది రోజుల క్రితం ఆ బీట్ పరిధిలోని అటవీశాఖ అధికారి నాగేశ్వరరావును హెచ్చరించారు. కాగా రైతు, ఆయన కుటుంబం చేతికి వచ్చిన పంటను నాశనం చేయవద్దని అధికారులను ప్రాధేయపడ్డారు. దాంతో పాటు స్థానిక నాయకుల ద్వారా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే బుధవారం అర్ధరాత్రి అటవీ అధికారులు ఆ భూమిలోని పత్తిపంటను తొలగించారు. గురువారం ఉదయం నాగేశ్వరరావు కుమారుడు రాజేష్ పొలం వద్దకు వెళ్లగా పత్తి మొక్కలు మొత్తం తొలగించి ఉండటంతో విషయాన్ని తండ్రి, కుటుంబ సభ్యులు గ్రామస్థులకు తెలిపాడు. అయితే గురువారం ఆళ్లపల్లి మండలంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటన ఉండగా.. ఆయన ఎదుట నిరసన తెలపాలని నిర్ణయించుకున్న రైతు కుటుంబం, రాయిపాడుకు పలువురు రైతులు.. పత్తి మొక్కలను ట్రాక్టర్‌లో ఆళ్లపల్లి రైతువేదిక వద్దకు తీసుకవచ్చారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వాహనానికి అడ్డుగా రోడ్డుపై పత్తిమొక్కలను పోసి, ఆందోళనకు దిగారు. జరిగిన నష్టానికి రూ.2లక్షలు చెల్లించాలని, అటవీశాఖ అధికారులు చేసిన దాష్టీకం గురించి వివరిస్తూ, ఎమ్మెల్యే కాళ్లపై పడి కన్నీరు పెట్టుకున్నారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే పాయం.. కలెక్టరేట్‌కు వెళ్లి అటవీశాఖ అధికారులను పిలిపించి మాట్లాడుదామని వారికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇదిలా ఉంటే భూమి ఇల్లెందు నియోజకవర్గం పరిధిలో ఉన్న క్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కూడా ఈ సమస్యపై దృష్టిపెట్టాలని, తమకు న్యాయం చేయాలని రైతు కుటుంబం డిమాండ్ చేసింది. అయితే ఈ వివాదంపై వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో స్పంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఖమ్మం లీగల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళను హత్య చేసిన కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ ఖమ్మం రెండవ అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి వెంపటి అపర్ల బుధవారం తీర్పుచెప్పారు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన మృతురాలి కుమారుడు షేక్. రఫి ఫిర్యాదులో పేర్కొన్న కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెల్లందడ గ్రామానికి చెందిన నిందితుడు పర్వతం వెంకన్న కోదాడ క్రాస్‌రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న ఫిర్యాదిదారుడి తల్లి షేక్ జాన్‌బీని 2022 ఫిబ్రవరి24 రాత్రి సమయంలో మేకల దొంగతనం చేయడానికి వచ్చి ఆమెను గొంతు కోసి హత్య చేశాడు. రెండు మేకలను ఎత్తుకెళ్లినాడు. మరుసటి రోజు ఇంటి పక్కన వారు గమనించి మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నిం దితుడు మేకలను దొంగిలించుకుని ఖమ్మం త్రీటౌన్ ఏరియాలో గాంధీ బొమ్మ సెంటర్లో మేకలను అమ్ముచుండగా పట్టుకొని తీసుకొచ్చినారని వారికి వివరించారు. కాగా మృతురాలి కుటుంబ సభ్యులు వచ్చే చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉంది. నిందితుని వివరాలు తెలుసుకొని ఖమ్మం రూరల్ పోలీసులకు మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి, కేసును విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అట్టి కేసులో సాక్షులను విచారించిన న్యాయాధికారి నిందితుడిపై హత్యానేరం రుజువు కావడంతో నిందితునికి జీవితకాలం జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.శంకర్ వాదించగా, కోర్ట్ లైజనింగ్ అధికారులు కె.శ్రీకాంత్ ఎస్ఐ, హోంగార్డు ఎస్.డి.యూసఫ్‌లు సహకరించారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య


మురళీకృష్ణ(ఫైల్)

బోనకల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన సూర్యదేవర మురళీకృష్ణ (35) మద్యానికి బానిసగా మారాడు. భార్య, భర్తల నడుమ మనస్పర్ధలు చోటు చేసుకోవడంతో రెండేళ్లుగా వారు విడిగా ఉంటున్నారు. దసరాకు మనవడితో పాటు కోడలు రావాలని మురళీకృష్ణ తండ్రి కోడలు వైష్ణవికి ఫోన్ చేశాడు. ఆమె రావడానికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన భర్త మురళీకృష్ణ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గురువారం ఎస్ఐ పొదిలి వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం దొరికిందని మోసం

ఖమ్మంక్రైం, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): బంగారం దొరికిందని ఓ మహిళలను ఇద్దరు మోసం చేసిన ఘటనపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నందు గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలానికి చెందిన ఓ మహిళ ఖమ్మంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద కొంతకాలంగా నివసిస్తుంది. ఈ నెల 20న నడుచుకుంటూ ఇంటికి వెళుతున్న సమయంలో గాంధీచౌక్ వద్ద మరో మహిళ ఆమె వెంట నడుచుకుంటూ వెళ్తుంది. ఓ బ్యాంకు సమీపంలోకి రాగానే గుర్తుతెలియని మరో మహిళ చేతిలో నుంచి ఒక కవర్ పడేసి వెళ్లిపోయింది. అది గమనించిన కొణిజర్ల మహిళ తన పక్కన వస్తున్న మరో మహిళ చూసి చూడగా బంగారం బిస్కెట్ దొరికిందని చెరిసగం తీసుకుందామని ఇరువురు అనుకున్నారు. అదే సమయంలో గుర్తుతెలియని మరో వ్యక్తి అక్కడికి వచ్చి అది పది తులాలు ఉంటుందని దాని విలువ సుమారు పది లక్షలకు పైగా ఉంటుందని చెప్పాడు. దీనికి నమ్మిన కొనిజర్లకు చెందిన మహిళను పక్కన ఉన్న మరో మహిళ 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. అది నమ్మిన కొణిజర్లకి చెందిన మహిళ పదివేల నగదు, మెడలోని రెండు తులాలు బంగారు గొలుసును పక్కన ఉన్న మహిళకు ఇచ్చింది. మిగిలిన నగదు ఇంటికి వెళ్లి తీసుకొస్తానని చెప్పడంతో ఓ పార్కువద్ద కూర్చుంటానని పక్కన ఉన్న మహిళ చెప్పడంతో ఇంటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత అది నకిలీ బంగారం అని గుర్తించిన ఆమె పలు చోట్ల వారిని వెతికింది. ఎక్కడా వారు దొరకకపోవటంతో గరువారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.



సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర

కూసుమంచి,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని మల్లేపల్లి నుంచి కూసుమంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ప్రజాప్రభుత్వం ఆరు గ్యారంటీ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పాలకుల మెడలు వంచి సమస్యలు పరిష్కారం కోసం కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తోటకూరి రాజు, షన్మతిరావు, గంగాధర్, రమణారెడ్డి, కర్ణబాబు, భారతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: కందాళ

నేలకొండపల్లి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని, ఆదుకుంటానని పాలేరు మాజీశాసనసభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మండల పరిధిలోని కోరట్లగూడెం, గువ్వలగూడెం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను కందాళ పరామర్శించారు. కోరట్లగూడెంలో రెండురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బచ్చలకూరి మనోజ్, మీసాల సన్నీప్రసాద్, పదిరోజుల క్రితం గువ్వలగూడెంలో మృతి చెందిన గోగినేని పుల్లయ్యల కుటుంబాలను పరామర్శించారు. గువ్వలగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న కందుల చిన్నఅప్పారావు, కోరట్లగూడెంలో గుండా వెంకమ్మలను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, శాఖమూరి సతీష్, మరికంటి రేణుబాబు, కొండా కనకప్రసాద్, బచ్చలకూరి శ్రీనివాసరావు, కొఠారి ప్రసాద్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఫార్మాసిస్ట్ డే

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ జనరల్ హాస్పటల్లో గురువారం ఫార్మసిస్ట్ డే వేడుకలను నిర్వహించారు. ఆరోగ్యం గురించి ఆలోచించండి, ఫార్మసిస్ట్ గురించి ఆలోచించండి అనే నినాదంతో పనిచేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్ వివరించారు. ఫార్మాసిస్టులను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమం ఆర్ ఎంవో డాక్టర్ రాంబాబు, ఏడీ సంతోష్, ఏవో రవికిశోర్, నందగిరి శ్రీనివాస్, శ్రీనివాస్, ఫార్మాసిస్టులు రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

కామేపల్లి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో ప్రతిభ కనబరిచి కామారెడ్డి మెడికల్ కాలేజీ సీటు సాధించిన జాస్తిపల్లి గ్రామానికి చెందిన కంచర్ల ప్రణవికి టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు రూ.5వేలు అందించారు. వాటిని టీడీపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో అందించారు. ఈకార్యక్రమంలో దేవండ్ల రాంబాబు, మండల ఉపాధ్యక్షుడు ఆముదాల నాగయ్య, గొర్రెపాటి రామయ్య, రాయల వెంకన్న, ఎర్రబోయిన లక్ష్మయ్య, దేవండ్ల జానయ్య పాల్గొన్నారు.

గంజాయి తాగేందుకు యత్నించిన వ్యక్తుల అరెస్ట్

కూసుమంచి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయరహదారి పక్కన దాబా హోటల్ సమీపంలో ఇద్దరు గంజాయి తాగేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్ట్ చేసినట్లు కూసుమంచి ఎస్ఐ నాగరాజు తెలిపారు. గురువారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఖాళీస్థలంలో ఇద్దరు అనుమానాస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకొని విచారించినట్లు తెలిపారు. మండలంలోని వాల్యాతండకు చెందిన బాణోతు అరవింద్, వడిత్య నవీన్‌గా గుర్తించారు. వారివద్దనుంచి 30గ్రాములగంజాయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నేలకొండపల్లి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నేలకొండపల్లిలోని అతిపురాతనమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. అక్టోబరు3వ తేదీ వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. 29వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణోత్సవం,, అక్టోబరు 2న దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం శమీపూజ నిర్వహిస్తారు. 3న దోపుసేవ, సాయంత్రం శ్రీపుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

కామేపల్లి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): స్థానికల సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయమని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ధీమా వ్యక్తం చేశారు. గురువారం జాస్తిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మల్లెంపాటి శ్రీనివాసరావు, మాజీఉపసర్పంచ్ బత్తుల పుల్లయ్య, దేవండ్ల క్రిష్ణయ్య, ఎర్రబోయిన బసవయ్య, కొరివి మోహన్‌రావు, దిరిశాల నవీన్, మంద రాజు, నాగమణి, మంత్రాల పుల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా అట్ల బతుకమ్మ వేడుకలు





పర్ణశాల వద్ద వేడుకల్లో పాల్గొన్న తుమ్మల యుగంధర్, కలెక్టరేట్‌లో వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న నామా



రైల్వే కాలనీలో..



మంచుకొండ పీహెచ్‌సీలో..



కోర్టు ఆవరణలో..

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబరాలలో భాగంగా గురువారం ఐదోరోజు జిల్లాలో అట్ల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మను పేర్చి ఆడుతూ, పాడుతూ తెలంగాణ సంస్కృతి చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించారు. నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో, నగరంలోని పలు ఆలయాలు, అమ్మవారి మండపాల వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో, ప్రియదర్శిని డిగ్రీకళాశాలలో గురువారం అట్ల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవినవరాత్రుల వేడుకల్లో భాగంగా నాలుగో గురువారం నగరంలోని వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలోని 47వ డివిజన్ బొక్కలగడ్డ ప్రాంతంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని రాష్ట్రకాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మిబండవద్ద వైభవంగా నిర్వహిస్తున్నారు.. అమ్మవారు కాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీ అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. రాపర్తినగర్‌లో మట్టితో తయారుచేసిన దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి బెల్లంఅన్నం,ముద్దపప్పు అన్నం, పాయిసం, పులిహోర ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు.

బతుకమ్మ ఆడిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకొనే బతుకమ్మ, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్లో ఐదోరోజు అట్ల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. రెవెన్యూతో పాటు వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ వేడుకలలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డిపాల్గొన్నారు. ఆవరణలో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ వేడుకలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, సివిల్ సప్లయ్ డీఎం శ్రీలత, బీసీ సంక్షేమఅధికారి జ్యోతి, తహసీల్దార్లు అరుణ, శ్వేత, సునీల్‌రెడ్డి, శ్రీరాం, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, కేర్‌టేకర్ వెంకన్న పాల్గొన్నారు.



భరతనాట్యం వేస్తున్న వరాల సహశ్రీ





ప్రియదర్శిని డిగ్రీకళాశాలలో, బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో..

భద్రమ్మ విగ్రహం ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ

కూసుమంచి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన డీసీసీడీ మాజీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ తల్లి భద్రమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్, పాలేరు, వైరా మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, బాణోతు చంద్రావతి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా భద్రమ్మ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇంకా డీసీసీబీ మాజీచైర్మన్ నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ మల్లీడు వెంకన్న, బెల్లం వేణు, వరప్రసాద్, ఉన్నం బ్రహ్మయ్య, వీరన్న, ఆసీఫ్, బాలాజీ, రామచంద్రు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోండి

కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొడాలి

నేలకొండపల్లి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందుతున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొడాలి గోవిందరావు కోరారు. మండల పరిధిలో 62మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం నేలకొండపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గోవిందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కట్టెకోల నాగార్జున, షేక్.ఖాజామియా, బొడ్డుబొందయ్య, ధరావత్ బాలాజీ,దండా పుల్లయ్య, కుక్కల హనుమంతరావు, నంబూరి రామారావు పాల్గొన్నారు.





వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించే వరకూ పోరాటం

మధిర రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించే వరకూ తమ పోరాటాలు ఆగవని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు హెచ్చరించారు. మధిరలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో రూ. 34 కోట్లతో వంద పడకల ఆస్పత్రిని నిర్మించారని తెలిపారు. భవనం పూర్తి ఐనా, రెండు సంవత్సరాలుగా రాజకీయ కారణాలను దృష్టిలో పెట్టుకొని భట్టి ప్రారంభించడం లేదని ఆరోపించారు. ప్రజారోగ్యం పట్ల భట్టి నిర్లక్ష్య వైఖరీని విడనాడాలని కోరారు.

తెలంగాణ అస్తిత్వాన్ని తెలియజేసేదే బతుకమ్మ

సత్తుపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భాద్రపద మాసం అమావాస్య నుంచి 9రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వాన్ని తెలియజేస్తుందని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సీ.హరికృష్ణ అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

మధిర: మధిర పట్టణంలో గురువారం వాడవాడలా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. బతుకమ్మల ఆటలకు నేడు ఐదో రోజు కావటంతో అనేక చోట్ల చిన్నా పెద్ద ఉత్సాహంగా బతుకమ్మ ఆటలు ఆడారు, మండపాల్లో దుర్గాదేవిని కాత్యాయని దేవి అలంకారంలతో పూజలు నిర్వహించారు.

వైరా: వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో గురువారం నిర్వహించిన బతుకమ్మ సంబురాలు అబ్బురపర్చాయి. పది అడుగుల భారీ బతుకమ్మను అత్యంత భక్తిశ్రద్దలతో రకరకాల పూలతో పేర్చి గౌరీదేవిని ఏర్పాటుచేసి పూజలు చేశారు. న్యూలిటిల్‌ప్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్లు కుర్రా సుమన్, డాక్టర్ కాపా మురళీకృష్ణ గౌరీ దేవికి పూజలు చేసి నైవేద్యం సమర్పించి బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు.

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ శ్రీ ఆదర్శ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో అలరించారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తల్లాడ: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారిణి డాక్టర్ కె.ప్రత్యూష ఆధ్వర్యంలో బతకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. పలురకాల పూలతో బతకమ్మలను పేర్చి ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ నీలిమ, డాక్టర్ నీష్మ, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ గోపి, సూపర్‌వైజర్లు కె. పెద్దపుల్లయ్య, భద్రమ్మ, ఝాన్సీలక్ష్మీపాల్గొన్నారు.



మదర్‌థెరిస్సా కళాశాలలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మతో చిన్నారులు, భూమేశ్వరరావు, సుమన్



బతుకమ్మలతో మునిసిపల్ కమిషనర్, ఉద్యోగులు



శ్రీఆదర్శ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

విద్యుత్ లైన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

వైరా, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన 33 కేవీ ఇంటర్ లింకింగ్, ఇన్ అండ్ ఔట్ కొత్త లైన్ ఛార్జింగ్‌ను గురువారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా పట్టణంలోని కరెంట్ సమస్యల పరిష్కారానికి ఈ ఇంటర్ లింకింగ్ లైన్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ట్రాన్స్‌కో డీఈ బండి శ్రీనివాసరావు, ఏడీఈ కిరణ్, ఏఈ సుందర్ కుమార్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు బొళ్ల గంగారావు, మచ్చా బుజ్జి, బీడీకే రత్నం, పమ్మి అశోక్, దార్నా రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, పాలేటి నర్సింహారావు, నర్వనేని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పు

▸ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో.. మంత్రి పొంగులేటి, కలెక్టర్, ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్‌నాయక్

కల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. కల్లూరులో గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి పొంగులేటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆషా స్వచ్ఛంధ సేవా సంస్థ తరుపున విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో సమీకృత పాఠశాలలతోపాటుగా మరో రూ.80 కోట్లతో సాంకేతిక విద్యా సంస్థలను కూడ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నతంగా రాణిస్తారన్నారు. తాను ఇదే కళాశాలలో నాడు ఓ కుగ్రామమైన నారాయణపురం నుంచి సైకిల్‌పై వచ్చి కష్టపడి చదువుకుని నేడు ఈ స్థాయికి ఎదిగానని నాటి జ్ఞాపకాలను మంత్రి గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా వసతి గృహం భవనం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో ఈ భవనాన్ని శంఖుస్థాపన కూడా చేయడం జరుగుతుందన్నారు. అలాగే విద్యా బోధనలో ఈ కళాశాలలో డిజిటల్ పరికరాలు కూడా అందిస్తామని చెప్పారు. అంతకు ముందు రూ. 75 లక్షల అంచనాతో నిర్మించన ముస్లీం షాదీఖానాను మంత్రి ప్రారంభించారు. ఇక్కడ షాదీఖానాకు అనుసంధానంగా గల ఖాళీగా ఉన్న కొంత మేరకు స్థలాన్ని కూడ ముస్లీం శుభాకార్యాలకు అప్పగించే విషయంలో మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందిస్తూ స్థల అప్పగింతపై ఆయన కలెక్టర్ అనుదీప్‌కు ఆదేశించారు. ఆ తరువాత ఎన్‌ఎస్పీ క్యాంపులో అంబేద్కర్ గ్రంథాలయ భవనానికి కూడా మంత్రి శంఖుస్థాపన చేశారు. అనంతరం ఏఎంసీ కార్యాలయంలో ప్రభుత్వం తరపున పలు శాఖలు ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ప్రజలకు దసరా శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బతుకమ్మలను మంత్రి పొంగులేటితో పాటుగా సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌లు బతుకమ్మలను ఎత్తుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, ఏనుగు సత్యంబాబు, సయ్యద్ అలీ ఎస్‌కె తురాబలి, ఉస్మాన్‌తో పాటు పలు అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫామ్‌లను అందిస్తున్న మంత్రి పొంగులేటి

గ్రూప్1కు పలువురి ఎంపిక



తల్లాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజోయతి): గురువారం తెలంగాణ ప్రభుత్వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్1 పోస్టుల ఎంపిక ప్రక్రియలో తల్లాడకు చెందిన చింతా రాహుల్ డీఎస్పీగా ఎంపికయ్యారు. తల్లాడకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చింతా రాజు, చంద్రకళల కుమారుడు రాహుల్ డీఎస్పీగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించారు.



తల్లాడ: మండలానికి చెందిన గోపిశెట్టి వెంకటేశ్వర్లు-విజయ దంపతుల కుమార్తె సుస్మిత యూపీఎస్సీకోసం ఢిల్లీలోని వాజీరామ్ రవి సంస్థలో కోచింగ్ తీసుకుని మూడో ప్రయత్నంలో గ్రూపు1లో ఎంపీడీవో పోస్టుకు ఎంపికయింది.



తల్లాడ: మండలంలో తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న జంగం పౌలు-శారమ్మ దంపతుల కుమార్తె జ్యోతి శిరీష ప్రతిభకు పేదరికం అడ్డంకికాదని నిరూపించింది. ఆమె గ్రూపు1లో ఆడిటింగ్ ఆఫీసర్ ఉద్యోగంతో పాటు గ్రూపు4 , గురుకుల టీచర్, స్కూల్ అసిస్టెంట్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉద్యోగాలు వరించాయి.



సత్తుపల్లి: పట్టణానికి చెందిన ఎల్‌ఐసీ ఏజంట్ గోలి శ్రీనివాసరెడ్డి, ఉషారాణి దంపతుల కుమార్తె హిమవర్షిణీరెడ్డి గ్రూప్1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. ఈమె సత్తుపల్లిలోని వాణీ విద్యాలయంలో 10వ తరగతి, ఇంటర్మీడియేట్ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో, ఆంధ్రాలోని ఎన్‌ఐటీలో బీటెక్ పూర్తిచేశారు. ఆరు నెలల క్రితం విడుదలైన పంచాయితీరాజ్ ఏఈ ఉద్యోగానికి సైతం ఎంపికై హైదరాబాద్‌లో విధుల నిర్వహిస్తున్నారు.



సత్తుపల్లి: స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన కోలేటి కృష్ణయ్య, పీరమ్మల కుమారుడు పుల్లారావు గ్రూప్-1 ఫలితాలలో ప్రతిభ చూపి ఎంపీడీఓ పోస్టుకు ఎంపికవ్వగా ఈయన ప్రస్తుతం న్యూఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్‌లో ఆడిటర్‌గా పనిచేస్తున్నారు. అంబేద్కర్ నగర్‌లో ప్రాథమిక విద్యాబ్యాసం, అన్నపురెడ్డిపల్లిలో గురుకులంలో 10వ తరగతి వరకు చదివారు. ఇతనికి ఉద్యోగం రావడం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.



కల్లూరు: కల్లూరు మండలం ఎర్రబోయనపల్లి గ్రామానికి చెందిన దొడ్డపునేని సందీప్ గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. దీంతో సందీప్ ల్యాండ్ అండ్ రెవెన్యూ స్టాంప్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉద్యోగం సాధించారు. ఇప్పటి వరకు సందీప్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వరిస్తున్నారు. ఎంతో పట్టుదలగా కష్టపడి చదివి గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. దొడ్డపునేని సర్వేశ్వరరావు, పద్మవతిల కుమారుడైన సందీప్ ఓ రైతు కుటుంబంలో జన్మించినాడు.



వైరా: మండలంలోని లక్ష్మీపురంకు చెందిన గ్రూప్1 ర్యాంకర్ సంగెపు లక్ష్మీ సాహితికి డీఎస్పీ పోస్టు లభించింది. తుది తీర్పుకు లోబడి హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వుల మేరకు ర్యాంకుల ప్రకారం గురువారం పోస్టులను టీజీపీఎస్సీ ప్రకటించింది.



బోనకల్: మండలంలోని తూటికుంట్ల గ్రామానికి చెందిన పాపినేని అఖిల్ గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రాథమిక విద్యను గ్రామంలోనే పూర్తి చేసిన అఖిల్, ఉన్నత విద్యను ఖమ్మంలోని ప్రైవేటు పాఠశాలల్లో పూర్తి చేశాడు. తన తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకులు, మిత్రుల ప్రోత్సాహకంతో విజయం సాధించానని, నిస్వార్థంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని పేర్కొన్నారు.



సత్తుపల్లి: వేంసూరు మండలం సత్యనారాయణపురంకు చెందిన పూరేటి శ్యాముల్, ఝాన్సీల కుమారుడు అజయ్ గ్రూప్-1ఫలితాలలో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. తండ్రీ శామ్యూల్ మండలంలోని తుంబూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా అజయ్ ప్రాథమిక విద్యాబ్యాసం సత్తుపల్లిలోని కృషి విద్యాలయం, కేకేఆర్ స్కూల్, ఇంటర్ విద్యను విజయవాడలోని శ్రీచైతన్య, బీటెక్‌ను ఐఐటీ భువనేశ్వర్‌లో పూర్తి చేశారు.

మధిరకు వంద పడకల ఆస్పత్రి తెచ్చిందే భట్టి



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్

మధిర, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిరకు వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయించిందే సీఎల్పీ నేతగా ఉన్నప్పుడు స్థానిక శాసన సభ్యుడు మల్లు భట్టి విక్రమార్కనే అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. గురువారం మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, సీపీఎం నాయకులు రాజకీయలబ్ధి కోసమే పూర్తయిన వంద పడకల ఆస్పత్రి ప్రారంభానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అడ్డుపడుతున్నారని విమర్శిస్తున్నారని అన్నారు. బిల్డింగ్ పూర్తయితే సరిపోదని దానిలో కావలసిన మౌలిక వసతులు కల్పించకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వాటి కోసం ఆరు కోట్లు మంజూరు చేయించారని ఆ పనులు జరుగుతున్నాయని అన్నారు. పనులు అన్నీ పూర్తియన తరువాత వంద పడకలు ఆస్పత్రికి కావాలసిన డాక్టర్లు, సిబ్బందిని నియమించి అన్ని హంగులతో త్వరలోనే ఆస్పత్రిని ప్రారంభిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, పాటిబండ్ల సత్యంబాబు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, అద్దంకి రవి, జహంగీర్, గొల్లమండల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మధిర అభివృద్ధికి భారీగా నిధులు



గోడ గడియారాలు పంపిణీ చేస్తున్న సవిత

మధిర,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిరను సుందర నగరంగా అన్ని రకాల హంగులతో అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించారని మాజీ కౌన్సిలర్ మల్లాది సవిత, శివాలయం మాజీ ఛైర్మన్ పాటిబండ్ల సత్యంబాబు అన్నారు. గురువారం తొమ్మిదో వార్డులో భట్టి ఫొటోతో ఉన్న గోడ గడియారాలను పంపిణీ చేశారు, మధిరలో 120 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయని, పది కోట్లతో ట్యాంక్‌బండ్ విస్తరణకు నిధులు మంజూరయ్యాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ఏన్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూతక్కలింగన్నపేట గ్రామానికి చెందిన చింతనబోయిన కావ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. యువతి మృతిచెందిన విషయం తెలుసుకున్న తిమ్మరావుపేట గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర వైద్యఆరోగ్య రవాణ శాఖ అధికారి బొర్రా తిరుపతయ్య బుధవారం రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామి ఇచ్చారు. వినోద్, చింతనబోయిన నరసింహారావు, పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

చింతకాని, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వంకాయలపాటి చిన్న సీతయ్య(87) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నాయకులు టీడీపీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి రామనాథం, అంబటి వెంకటేశ్వర్లు, తేలుకుంట్ల శ్రీను, వంకాయలపాటి లచ్చయ్య, ఏటుకూరి రవి, మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, బొడ్డు వెంకటరామారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సంఘం నాయకుల అరెస్ట్

కల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాడు చేస్తూ అంగన్‌వాడీల సంఘం చలో సెక్రటేరియట్ పిలుపు నిచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కల్లూరులో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యానియాన్ నాయకులను స్థానిక పోలీసులు ముందుస్తుగా అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకే పోలీసులు ఆ సంఘ నాయకులైన వాణీ, పద్మ హేమలత, సఫీయా, రత్తమ్మల నివాసాలను వెళ్లి వారిని తీసుకోవచ్చి స్టేషన్‌లో మధ్యాహ్నం 1 గంట వరకు అదుపులోకి ఉంచారని తెలిసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని టౌన్-2 ఫీడర్‌లోని 63కేవీఏ డీటీఆర్ నూతన ట్రాన్స్‌ఫార్మర్ వర్క్ నిమిత్తం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శరత్‌బాబు గురువారం తెలిపారు. దీంతో జూపల్లి కంటి ఆసుపత్రి ఏరియాలో వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేపటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు దసరా సెలవులు

కారేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల 27నుంచి అక్టోబరు4 వరకు ప్రభుత్వం దసర సెలవులు ప్రకటించిన్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో దయమణి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సూపర్‌వైజర్లకు లిఖితపూర్వక సమాచారం అందించారు. దసర సెలువులకు సంబంధించిన సమాచారాన్ని మండల పరిధిలోని టీచర్లకు సమాచారం ఇవ్వలన్నారు. అలాగే 26న ప్రతి కేంద్రంలోని చిన్నారులకు 8రోజులకు సరిపడా పౌష్టికాహారం ఇవ్వలన్నారు.